# రాను ★ పోను ★ లాభం

● జి. వి. రంగాచార్యులు ●

సంతనుండి వచ్చేసరికల్లా కాంతమ్మ వేడినీళ్లు స్నానానికి యిచ్చింది. స్నానంచేసి భోంచేసేడు. మాటలాడకుండా పడుకున్నాడు. శెట్టి ఈవేళ ఇలా మాటలాడకుండా పడుకోవటం చూస్తే కాంతమ్మకు ఏదోమాదిరిగా అనుమానంగానే వున్నది. కాని ఎందుకు అడగటం అని వూరుకున్నది.

కాని ఆగలేక 'సంతమూటలో ఏం పెట్టారో ఎలికలు తింటయి దాస్తాను, మూట ఎక్కడా?' అన్నది చమత్కారంగా.

శెట్టి మాటలాడలేదు.

నిద్దరేమోనని దగ్గరకు వెళ్ళి మళ్లీ పిల్చింది. నిద్రఅయితేగా, శెట్టి లేవలేదు. మాటాడలేదు.

కాంతమ్మ పడుకుంది. తెల్లవారింది.

నలుగురూ అరుగులమీద కూచుని దంతధావనం చేస్తావున్నారు. శెట్టిగారుకూడా చేస్తూన్నారు.

మా వూళ్ళో సుబ్బయ్యగారని పౌరోహితుడు. ఆయన ప్రతి ఆదివారంలోనూ పెద్దశెట్టిగారి ఇంటికి రావటం రివాజు. సుబ్బయ్యగార్ని చూడటంతోనే కాంతమ్మ చాపవేసింది. కూర్చున్నాడు సుబ్బయ్యగారు.

సు: ఏం శెట్టీ. ఏమిటి సంతవిశేషాలు. ముతకలు గిరాకా? సన్నాలా?

శెట్టి: ఏం సంతలేండి సుబ్బయ్యగారు. ఈ కాంగ్రేసు మంత్రులొచ్చాక యాపారం అంతా పోయింది. దాంతో తినేందుకు బీదోళ్లకి అన్నం లేదు. మనవాళ్ళకా సరుకు దొరకదు. పనిచేసే వాళ్ళకి చేతినిండా పనిలేదు. ఏం సంత, ఏం బేరం.

సు: అంతే. ఏం చేస్తాం. ఏదో కాలం గడపాలిగా? ఇంతకూ విశేషాలేమిటి?

శెట్టి: ఏం చెప్పను బాబు. సన్నాలు, సన్న సన్నగా వెళ్ళినయి, ముతకలవద్ద పెట్టు తగిలింది. తిన్నతిండి వెళ్ళిపోయింది. ఏమిటో రాను, పోను లాభం.

అనేసరికల్లా సుబ్బయ్యగారు సన్నాలకు కొంచెం గిరాకీ వున్నదికామోసు. ముతకలు ఎవరూ కొనలేదు. కొద్దిలాభం ఖర్చులకు సరిపోయిందనుకుని తేల్చుకున్నాడు. సరే వస్తానని వెళ్లాడు. శెట్టి మొగం కడుక్కొని లోపలికి వెళ్లాడు.

... ... ...

కాం: ఏమండీ వీపుమీద ఆ వాతలేమిటి?

శెట్టి: ఏమో! ఏమయినా గీసుకున్నదేమో?

కాం: సరే. మీ వంటిమీద గీసుకున్నది మీకు తెలియదే. చాలా బాగుందండీ మీ సమాధానం. సరేగానీ ఈ తడవ సంతనుంచి ఏం తెచ్చారు? రాత్రి ఎన్ని పిల్చినాకూడా పలుకలేదేం?

శెట్టికి ఏం చెప్పటానికి తోచలేదు. మాట్లాడకుండా గదిలోకి పోతూవున్నాడు. కాంతమ్మ వెనకనుంచి చూచింది వీపుమీద బాగా వాతలు పడ్డాయి. నెత్తురుగూడా కమ్మింది. దాంతో రాత్రి శెట్టి మాట్లాడకపోవటం సంతనుంచి ఏమీ తీసుకురాకపోవటం, వీపుమీద ఈ వాతలు చూసి ఏదో జరిగిందని వూహించి గదిలోకి వెళ్ళి గట్టిగా అడిగింది.

శెట్టికి ఏడుపు వచ్చింది. కాని ఆపుకున్నాడు. ఆపుకుని 'ఏం చెప్పను, దొంగలు కొట్టారు' అన్నాడు.

కాం: ఎందుకండీ మరి ఇపుడు సుబ్బయ్యగారితో సన్నాలుసన్నాలుగా వెళ్లినయ్యి. ముతకలు బేరంలేదన్నారుగా? ఇప్పుడు నాతో ఇలా అంటారేం?

శెట్టి: అవును. నేనేం అబద్ధం చెప్పాను. సన్నాలమూట వీపుమీద వున్నది. అది వాళ్ల ముందుకు పడేసరికల్లా తీసుకున్నారు. ముతకలు ముందర వున్నవి. అవి నా పొట్టక్రింద పడ్డయి. వాటిని నేను ఇవ్వకపోతే నన్ను తన్నారు, గుద్దినారు, చివరికి కాళ్లతో తొక్కేలాక్కున్నారు. అంచేత ముతకలు పెట్టు తగిలినయ్యి అని అన్నాను. తిన్నతిండి కక్కుకున్నాను. అందుకని తిన్నతిండి వెళ్ళిపోయింది. రాను, పోను కాళ్ల నెప్పులు ఇదీ లాభం. తెల్సిందా.